ఆదివాసీల భూములకు రక్షణ ఎక్కడ?



5లో..

www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 233, గురువారం 24-9-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

భక్తులు, ఉత్సవ కమిటీల సహకారంతో నవరాత్రి ఉత్సవాలు విజయవంతం



3వ పేజీల్లో

## జూరాల ప్రాజెక్టుకు

# 3 టీఎంసీల నీటి విడుదల

## కర్ణాటక ప్రభుత్వం అంగీకారం







**హైదరాబాద్, సెప్టెంబర్ 23:**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల జలాశయం పరిధిలోని రైతుల సాగునీటి అవసరాలు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎగువన ఉన్న కృష్ణా జలాలను విడుదల చేయాలని తెలంగాణ ప్రజాప్రతినిధుల బృందం కర్ణాటక ప్రభుత్వాన్ని కోరింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల బృందం బుధవారం కర్ణాటక డిప్యూటీ సీఎం (ఇరిగేషన్ మంత్రి) డి.కె. శివకుమార్‌తో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, జి మధుసూదన్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో నారాయణపూర్, ఆల్మట్టి జలాశయాల నుంచి జూరాలా ప్రాజెక్టుకు నీటి విడుదల అంశంపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ ప్రాంత రైతుల పంటలను కాపాడేందుకు అత్యవసరంగా నీటిని విడుదల చేయాలని కోరగా, దీనికి కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడుతల వారీగా మొత్తం 3 టీఎంసీల నీటిని జూరాల ప్రాజెక్టుకు విడుదల చేసేందుకు డి.కె. శివకుమార్ అంగీకారం తెలిపారు. ఈ సమావేశంలో కర్ణాటక ఇరిగేషన్ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మరోవైపు జూరాల ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడేందుకు అధికారులు ఇప్పటికే నీటిని విడుదల చేయడం ప్రారంభించారు.



## బిఆర్ఎస్ ది దోపిడీ పాలన.. కాంగ్రెస్‌ది

# సంక్షేమ పాలన

### ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో వేల కోట్లు దోపిడి

### పులుసుబొంత ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి

### మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 :**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులను రీ డిజైన్ ల పేర్లతో నిర్లక్ష్యం చేసి, వేలాది కోట్ల తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి

..మిగతా 2లో



## రాష్ట్రాలకు ఇన్‌చార్జిల

# నియామకం

### 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు

### తమిళనాడు ఇన్చార్జిగా రామ్ మాధవ్

### కో ఇన్ చార్జిగా డీకే అరుణ నియామకం

### ఒడిసా ఇన్ చార్జిగా పురంధేశ్వరి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 :**

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులకు అధిష్ఠానం రాష్ట్రాల బాధ్యతలను అప్పగించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు కొత్తగా ఇన్‌ఛార్జ్‌లు,కో-ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. ఏపీకి ఇన్‌ఛార్జ్‌గా అరవింద్ భదౌరియా, తెలంగాణ ఇన్‌ఛార్జ్‌గా సునీల్ భన్సల్, సహ ఇన్చార్జులుగా రేఖ శర్మ, అభయ్ పాటిల్‌లను నియమించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పేరిట బుధవారం ఓ ప్రకటన విడుదలైంది. పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కూడా

..మిగతా 2లో

# ఎస్ ఆర్-2026లో పారదర్శకతతో ఖచ్చితమైన పరిశీలన

### క్షేత్రస్థాయిలో ప్రక్రియను పరిశీలించిన సి ఈ ఓ సి. సుదర్శన్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి , సెప్టెంబర్ 23 :**

జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ -2026 ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి నాగోల్ వార్డు కార్యాలయం, కుర్షి కాలనీ, శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్‌లను సందర్శించి క్షేత్రస్థాయిలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఓటర్ల వివరాల పరిశీలన, పాత ఓటర్ల జాబితాలతో మ్యాపింగ్ లేదు,క్రమరాహిత్యాలు వంటి కేటగిరీలపై



ప్రత్యేక దృష్టి సారించాలని సి ఈ ఓ సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే సమయంలో అనర్హులు, డూప్లికేట్ ఎంట్రీలు, చిరునామా మార్పులు తదితర అంశాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తు, అభ్యంతరం, నోటీసు, ఫైల్ డిస్పోజల్ వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి అభ్యంతరాలు, వివరణలను నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రతి బి ఎల్ ఓ, క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలోని ఓటర్ల వివరాలను బాధ్యతాయుతంగా పరిశీలించాలని సి ఈ ఓ తెలిపారు. డోర్-టు-డోర్ వెరిఫికేషన్, డాక్యుమెంట్ల పరిశీలన, డేటా ఎంట్రీ, మ్యాపింగ్ తదితర ప్రక్రియల్లో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక లేదా క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి దశను సమర్థవంతంగా పూర్తి చేయాలని సి ఈ ఓ సూచించారు. నిర్దేశిత కాలపరిమితిలో ప్రక్రియను పూర్తి చేసేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఎల్‌బీ నగర్ ఈ ఆర్ ఓ, జెడ్ వికాస్ మహాతో, సంబంధిత ఎన్నికల అధికారులు, బి ఎల్ ఓ లు , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించడంలో

# కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం



## మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

### ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రాజెక్టుల మోటార్లు ఆన్ చేసి వెంటనే నీరు విడుదల చేయాలి

### రైతుల తరపున ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ నాయకుల ముందస్తు నిర్బంధాలు

### మీడియా సమావేశంలో బిఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు, ముఖ్య నాయకులు

**గద్వాళ, సెప్టెంబర్ 23 :**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్రంగా విఫలమైందని, వ్యవసాయానికి కనీసం 12 గంటలు కరెంట్ కూడ ఇవ్వలేని దయనీయ స్థితిలో ఉనదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తన్నీరు హరీష్ రావు విమర్శించారు.బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు తో కలిసి ఆయన

..మిగతా 2లో




## ఐదు రోజులు

# బ్యాంకుల బంద్

### బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం

### సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె

**న్యూఢిల్లీ సెప్టెంబర్ 23 :**

దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంతరాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఫలితంగా సెప్టెంబర్ చివరి వారంలో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలు, ఇతర పెండింగ్

..మిగతా 2లో



# హై అలెర్ట్..!

2లో..

## తీరం దాటిన వాయుగుండం

### మరో రెండు రోజులు వర్షాలు.. 48 గంటల పాటు అప్రమత్తత



# ఇంటిపై పిడుగు.. తప్పిన పెను ప్రమాదం

**గద్వాల , సెప్టెంబర్ 23:**

గద్వాల పట్టణంలోని హమాలీ కాలనీలో గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ముందు ఉన్న నరేందర్ కుమార్ ఇంటిపై బుధవారం సాయంత్రం పిడుగు పడటంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈ సంఘటన జరిగిన సమయంలో ఇంట్లోనే ఉన్న కుటుంబ సభ్యులు క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న 3వ వార్డు కౌన్సిలర్ నాగులు యాదవ్, వార్డు ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయితే ఇదే ఇంటిపై 3నెలల క్రితం పిడుగుపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## జనసేన తెలంగాణ జాయినింగ్ కమిటీ కన్వీనర్‌గా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 23:**



జనసేన పార్టీ తెలంగాణ జాయినింగ్ కమిటీ కన్వీనర్ గా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ నియమితులయ్యారు.గతంలో ఉన్న కమిటీలో అవసరమైన మార్పులు, చేర్పులు చేస్తూ 10 మంది సభ్యులతో సవరించిన జాయినింగ్ కమిటీకి కన్వీనర్ గా ఆయన వ్యవహరిస్తారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం ప్రకటించింది. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అలాగే రాబోయే ఎలక్షన్లలో జనసేన పార్టీ జెండాను ఎగురవేస్తామని దిమా వ్యక్తం చేశారు..



# హై అలెర్ట్..!

**హైదరాబాద్, సెప్టెంబర్ 23:**

పశ్చిమమధ్య ,దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 13 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా కదులుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది ప్రస్తుతానికి కళింగపట్నానికి 30 కి.మీ, విశాఖపట్నానికి 90 కి.మీ, గోపాల్‌పూర్‌కు 160 కి.మీ దూరంలో కేంద్రీకృతమైందని వెల్లడించారు. ఇది బుధవారం రాత్రి 11-12 గంటల సమయంలో ఉత్తర కోస్తా -- దక్షిణ ఒడిశా తీర ప్రాంతలైన విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. ఆర్టీజీఎస్‌అవేర్-విపత్తుల నిర్వహణ సంస్థ సమన్వయంతో తీవ్ర వాయుగుండంపై క్షేత్రస్థాయిలోని అధికారులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలను జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. తీవ్రవాయుగుండం తీరం దాటినప్పటికి భారీ వర్షాల కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు మరో 48 గంటలు పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున చెట్లు , హోర్డింగ్స్ వద్ద నిలబడరాదన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని హెచ్చరించారు. ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర సహాయక చర్యల కోసం శ్రీకాకుళంలో 3, అల్లూరి 2, విశాఖ 2, పోలవరం1, అనకాపల్లిలో ఒకటి మొత్తంగా 5 ఎస్డీఆర్ఎఫ్, 4 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రభావిత జిల్లాల్లో సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రజలు సమాచారం కోసం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 1800 4250101 సంప్రదించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు,బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. బుధవారం సాయంత్రం 7 గంటల నాటికి శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో 88.2మిమీ, లక్ష్మీనర్సుపేటలో 73.7మిమీ, ఎన్టీఆర్ జిల్లా పుట్రేలలో 67.6 మిమీ, రెడ్డిగూడెంలో 64.1 మిమీ, ఎ.కొండూరులో 62.8మిమీ, ఏలూరు జిల్లా ఏదులగూడెంలో 57 మిమీ, కృష్ణా జిల్లా పెదయెరుకపాడులో 53.7మిమీ , ఎన్టీఆర్ జిల్లా కొర్లమండలో 50.7మిమీ, చందర్ల 49మిమీ, శ్రీకాకుళం జిల్లా మందసలో 44.7మిమీ చొప్పున వర్షాలు నమోదైనట్లు వివరించారు. మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి బుధవారం ఉదయం 8:30 గంటల వరకు నమోదైన అత్యధిక వర్షపాతం వివరాలు జిల్లా వారీగా వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో 141మిమీ, అల్లూరి జిల్లా జి.మాడుగులలో 100మిమీ, విశాఖ జిల్లా భీమునిపట్నంలో 97మిమీ, ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో 94మిమీ, పోలవరం జిల్లా కూనవరంలో 91మిమీ, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో 89మిమీ, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 80మిమీ, అనకాపల్లి జిల్లా సబ్బవరంలో 78మిమీ, కోనసీమ జిల్లా అయినవిల్లిలో 76మిమీ, మన్యం జిల్లా బలిజిపేటలో 75మిమీ చొప్పున నమోదైందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.



## రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు వెంటనే అన్ని ప్రాజెక్టుల మోటార్లు ఆన్ చేసి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, వారి తరఫున గళమెత్తుతున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులను,కార్యకర్తలను ముందస్తు నిర్బంధాలకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, బీచుపల్లి, ఆల్లపాడు ప్రతాప్, చక్రధర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, సోమశేఖర్ రెడ్డి, శ్రీరాములు, అంజి, ప్రహ్లాదు లతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ది దోపిడీ పాలన.. కాంగ్రెస్‌ది సంక్షేమ పాలన

మొదటి పేజీ తరువాయి...

శ్రీనివాస రెడ్డి ప్రసంగించారు.

**మండలంలోని 23 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం.**

ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ద్వారా తుమ్మల చెరువు నుంచి 4,300 ఎకరాలకు సాగునీరు అందుతుందని,భవిష్యత్తులో అశ్వాపురం మండలంలోని అన్ని ప్రాంతాల పరిధిలో 23 వేల ఎకరాలకు సాగునీరు అందేలా కృషి చేస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి మేరకు అనేక ఏళ్లుగా పెండింగ్లో ఉన్న పులుసు బొంత ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని, అవసరమైన భూసేకరణ, అటవీ క్లియరెన్స్ ను ఆచరణలోకి తెస్తామని అన్నారు.

**గత పాలకుల స్వలాభం కోసం రీ డిజైన్లు**

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్సార్ హయాంలో ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తే బీఆర్ఎస్ పాలకులు రీ డిజైన్ల పేరుతో వేల కోట్లాది రూపాయలను దండుకునేందుకు.సీతారామ ప్రాజెక్టు ను వారి స్వలాభాలకు ఎలా మార్చుకున్నారో అందరికీ తెలిసిన విషయమేనని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక మారేళ్లపాడు ప్రాజెక్టు పూర్తి చేశామని, భవిష్యత్తులో అనేక సాగునీటి ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. కులమతాలకతీతంగా తమ పాలన సాగుతుండగా బీఆర్ఎస్ వారేమో అసెంబ్లీ దళిత స్పీకర్ తల్లి పట్ల అహంకారపూరిత భాషతో మాట్లాడుతుండటం బాధాకరమని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను 3, 4 విడతల్లో కూడా అందజేస్తామని, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చూస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




## వరసగా ఐదు రోజులు బ్యాంకుల బంద్

మొదటి పేజీ తరువాయి...

సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంతకాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు మంగళవారం డిప్యూటీ లేబర్ కమిషనర్ తో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు సమ్మె చేపట్టాలని నిర్ణయించాయి. సమ్మెకు ముందు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో శని, ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సాధారణ సెలవులు ఉన్నాయి. దీంతో మొత్తం ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఇదే డిమాండ్లతో ఈ నెల 11న కూడా బ్యాంకు సంఘాలు సమ్మె నిర్వహించిన విషయం విదితమే. ఈ పరిణామాల దృష్ట్యా, వినియోగదారులు తమ ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## రాష్ట్రాలకు ఇన్‌చార్జిల నియామకం

మొదటి పేజీ తరువాయి...

సునీల్ భన్సల్‌కు అప్పగించింది అధిష్ఠానం. స్మృతి ఇరానీ హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లకు ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు ఇచ్చింది. బీజేపీ కొత్త ఇన్‌ఛార్జ్‌ల లిస్టులో తెలుగువారికి అవకాశాలు దక్కాయి. సీనియర్ నేత రామ్ మాధవ్ తమిళనాడు బీజేపీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. సహ ఇన్‌ఛార్జ్‌గా ఎంపీ డీకే అరుణకు అవకాశం కల్పించారు. ఏపీ ఎంపీ పురందేశ్వరికి ఒడిశా ఇన్‌ఛార్జ్‌గా, కర్ణాటక సహ ఇన్‌ఛార్జ్‌గా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లును అధిష్ఠానం నియమించింది.



## రాజీవ్ గాంధీ నగర్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

### అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 23 :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ ఎల్లమ్మబండ రాజీవ్ గాంధీ నగర్ లో శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మరియు కాలనీవాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "లివినాయక మండపనికి ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మరియు ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం శ్రీ సిద్ధి వినాయక అసోసియేషన్ వినాయక మండపం వద్ద పట్వారి శశిధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. శ్రీ మానస స్కూల్ అఫ్ డాన్స్ అధినేత్రి, మాస్టర్ టుమాటి ప్రణవిల శిష్య బృందం చేసిన నృత్య ప్రదర్శన భక్తులను ఎంతో ఆకట్టుకుంది.ఈ కార్యక్రమం అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన ఎంతో అద్భుతంగా ఉందని ప్రతి ఒక్కరూ అభినందించారు. కాలనీలో ఇలాంటి చక్కటి సాంస్కృతిక ప్రదర్శనను అందించినందుకు ప్రణవి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులందరికీ మెమొంటోలు బహూకరించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనివాసులు, మహిళలు నాయకులు, తల్లీతండ్రులు, యువకులు, భక్తులు, మరియు టీం పట్వారి తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేట్‌లో ఘనంగా మహాగణపతికి పూజలు

### ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బండి రమేష్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 23 :**



కూకట్ పల్లి నియోజకవర్గంలోనీ మూసాపేట్ డివిజన్ లోని నవ యువక అసోసియేషన్స్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడి విగ్రహానికి బుధవారం పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ , కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక ఐక్యతను చాటేలా వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి పూజా కార్యక్రమాలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను, యువతలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ నాయకుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, సత్యం శ్రీరంగం, ప్రతాప్‌రెడ్డి, కొండలురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ డివిజన్ల అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, నాగేశ్వర్‌రావు, నరేష్‌కుమార్, అశోక్ ముదిరాజ్, శ్రీనివాస్, వెంకటేష్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.



## ఎల్లమ్మబండ నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

### మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చొరవతో ట్రాఫిక్ క్లియర్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 23 :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ చౌరస్తా నుండి హౌసింగ్ బోర్డు వెళ్లే ఉషముల్లపూడి ప్రధాన రహదారిలో, ఆల్విన్ కాలనీ ఫేస్-2 నుండి శంషిగూడ వెళ్లే హైటెన్షన్ రోడ్డు నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుండడంతో వాహనదారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయాన్ని స్థానిక ప్రజలు ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ మరియు బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు.దీనికి స్పందించిన బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు వెంటనే అక్కడ సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసి యూ-టర్న్ ను మూసివేసి ట్రాఫిక్ సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించిన బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు గారికి మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్, లింగం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల నృత్యాల నడుమ గణనాథునికి ఘన వీడ్కోలు

**--- చల్లటి చినుకుల్లోనూ భక్తి పరవళ్లు**

**--- నవరాత్రులు భక్తుల పూజలందుకున్న విఘ్నేశ్వరుడు వైభవంగా నిమజ్జనానికి పయనం**

**--- అలసిన భక్తులకు 'టిడబ్ల్యూజేఎఫ్' ఆధ్వర్యంలో పులిహోర, చల్లటి మంచినీటి సేవలు**

**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 23 (భద్రాద్రిన్యూస్):**–తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలు, మంత్రోచ్ఛారణలు, భక్తి శ్రద్ధలతో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు ఘనంగా వీడ్కోలు అందుకున్నారు. నగరంలోని నలుమూలల నుంచి వివిధ ఆకృతుల్లో అలంకరించబడిన గణనాథుల విగ్రహాలు భక్తుల కోలాహలం, డప్పు వాయిద్యాల మోత, భక్తుల నృత్యాల నడుమ నిమజ్జనానికి తరలివెళ్లాయి. చల్లటి చినుకులు కురుస్తున్నా భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. వర్షపు చినుకులను సైతం విఘ్నేశ్వరుడి ఆశీస్సులుగా భావిస్తూ భక్తులు భక్తిపారవశ్యంలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ వాహనాలపై వైభవంగా తరలివచ్చిన గణనాథులు భక్తుల జయజయధ్వానాల మధ్య ధంసలాపురం నిమజ్జన ఘాట్‌కు చేరుకున్నారు. డప్పుల మోతకు అనుగుణంగా యువత, మహిళలు, చిన్నారులు భక్తి నృత్యాలతో సందడి చేయగా, పరిసర ప్రాంతమంతా గణనాథుడి నామస్మరణతో మార్మోగింది. తొమ్మిది రోజుల పాటు భక్తుల ఆధ్యాత్మిక భావోద్వేగాలకు కేంద్రంగా నిలిచిన విఘ్నేశ్వరుడికి కన్నుల పండువగా వీడ్కోలు పలికారు.




**భక్తులకు అండగా 'టిడబ్ల్యూజేఎఫ్' సేవలు :**
నిమజ్జనానికి తరలివచ్చిన భక్తుల అలసటను గుర్తించి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ నాయకత్వం మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలను చేపట్టింది. ముస్తఫా నగర్ ప్రాంతంలో భక్తులకు ఉచితంగా పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేయడంతో పాటు చల్లటి మంచినీటిని అందించారు. గంటల తరబడి నిమజ్జన వేడుకల్లో పాల్గొని అలసిపోయిన భక్తులకు ఈ సేవలు ఆప్యాయతను, ఆత్మీయతను పంచాయి. ఫెడరేషన్ నాయకులు శీలం వెంకటేశ్వరరెడ్డి (ఎస్వీ రెడ్డి) ఆధ్వర్యంలో నిర్వహించిన పులిహోర ప్రసాదం, మంచినీటి సేవలను టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు టిఎస్ చక్రవర్తి లు అభినందించారు. గణేష్ నిమజ్జన మహోత్సవంలో భక్తులకు ఆహారం, తాగునీరు అందించడం పుణ్యకార్యమే కాకుండా మానవత్వానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ, అదే సమయంలో నిమజ్జనానికి వచ్చిన భక్తులకు సేవ చేయడం ద్వారా భక్తి, సేవ, మానవతా విలువలను ఒకే వేదికపై చాటిన కార్యక్రమంగా ఈ సేవా కార్యక్రమం నిలిచిందన్నారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో, భక్తుల ఆదరాభిమానాలతో సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. సేవలను స్వీకరించిన పలువురు భక్తులు టిడబ్ల్యూజేఎఫ్ నాయకత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ జానిపాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ అంజద్, పత్తి శ్రీనివాస్, నాయకులు వి. రోశిరెడ్డి, ఏ. మురళి, బి. రవి, ఖమ్మం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు పాల్గొన్నారు.

# భక్తులు, ఉత్సవ కమిటీల సహకారంతో నవరాత్రి ఉత్సవాలు విజయవంతం...

**- పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య**

**- నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, పోలీసుల నిరంతర పర్యవేక్షణ**

**- భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లతో ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు**






**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబరు - 23 (భద్రాద్రిన్యూస్):** గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం, పోలీస్ శాఖకు సహకరించిన భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ధన్యవాదాలు తెలిపారు. భక్తుల సమన్వయం, ఉత్సవ కమిటీల సహకారం, వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు. బుధవారం స్థానిక ముస్తఫానగర్ చౌరస్తా వద్ద గణేష్ నిమజ్జన శోభాయాత్రను పోలీస్ కమిషనర్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రుల ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. నిమజ్జనం కోసం ప్రత్యేక ఘాట్ సిద్ధం చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, అవసరమైన మౌళిక సదుపాయాలు, భద్రతా చర్యలు, ప్రజలకు మార్గనిర్దేశం చేసే ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు వివరించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు చురుగ్గా పాల్గొంటూ తమ సహకారం అందించారని అన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, పోలీస్ శాఖ సూచనలను పాటించిన భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది, పోలీసుల నిరంతర పర్యవేక్షణ తో, గణేష్ విగ్రహాల నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకునే వరకు అవసరమైన భద్రతా పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. రాత్రంతా, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితులను పర్యవేక్షిస్తూ పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తులు, నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు పాటించాలని కోరారు. శోభాయాత్రలో క్రమశిక్షణ పాటిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. నిమజ్జన సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి, చిన్నారులు, వృద్ధులు, మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ సమన్వయంతో వ్యవహరించి, నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు సహకరించాలని వారు కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ఉత్సవ కమిటీలు, భక్తులు అందించిన సహకారం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు పరస్పర సహకారంతో వ్యవహరించడం ద్వారా సోదరభావం, సామాజిక సమైక్యతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పోలీస్ శాఖ, మునిసిపల్ అధికారులు, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ధంసలాపురం చెరువు వద్ద తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, శోభాయాత్ర నిర్వహణ, భద్రతా చర్యలను వారు స్వయంగా పర్యవేక్షించి, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ డోవలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 26న వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

**– జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జ్యోతి**



**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ -23( భద్రాద్రిన్యూస్ ):** సెప్టెంబర్ 26 న వీరనారీ చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి వేడుకలు సెప్టెంబర్ 26న ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీసి అభివృద్ధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఈ నెల 24 నుండి 26 వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు చివరి అవకాశం...

**- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రవిబాబు**



**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ -23 (భద్రాద్రిన్యూస్ ):** 2026-27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మొదటి సంవత్సరం చేరాలనుకునే విద్యార్థులకు రాష్ట్ర ఇంటర్ బోర్డు ఈ నెల 24 నుండి 26 వరకు చివరి అవకాశాన్ని కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె. రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ ముగియనుండటంతో, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**– జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జ్యోతి**



**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ -23( భద్రాద్రిన్యూస్ ):** సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు సెప్టెంబర్ 27న ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీసి అభివృద్ధి అధికారిణి జ్యోతి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# 77 వేలకు ఘనంగా లడ్డు వేలం పాట



**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 23 ( భద్రాద్రి న్యూస్ ):** గణేష్ నవరాత్రులలో భాగంగా ముస్తఫా నగర్ పెట్రోల్ బంకు వెనుక భాగంలో 18వ డివిజన్లో ముక్తిదాయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపంలో బుధవారం లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 77,777 రూపాయలకు కూరపాటి ఉదయ్ సుమన్- ప్రమీల దంపతులు లడ్డును సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజేత దంపతులకు ముక్తిదాయ ఉత్సవ కమిటీ తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు

# జై బోలో గణేష్ మహరాజ్ కి జై ఎడతెరిపిలేని వర్షంలోనూ పోటెత్తిన భక్తజనం

**- చాలెంజర్స్ యూత్.. ఆధ్వర్యంలో మహా అన్నదానం**






**లక్ష్మీదేవీపల్లి, సెప్టెంబర్ 23 (భద్రాద్రిన్యూస్) :** గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని లక్ష్మీదేవీపల్లి కొమరయ్యకాలనీలో చాలెంజర్స్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత 18 సంవత్సరాలుగా చాలెంజర్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ తమ సేవాభావాన్ని చాటుకుంటున్నారు. బుధవారం ఉదయం నుంచే ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నప్పటికీ భక్తుల రాక ఏమాత్రం తగ్గలేదు. కొమరయ్యకాలనీలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి భక్తజనం పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా చాలెంజర్స్ యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు ప్రతి ఏడాది అన్నదానం కొనసాగించడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన భక్తులు, స్థానికులు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ స్తంభాద్రి ఖమ్మం నగర స్వర్ణకార సంఘం లడ్డు లక్కీడ్రా విజేత మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన రావు



**ఖమ్మం, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్ ప్రతినిధి):**వినాయక చవితి సందర్భంగా స్వర్ణ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో నవరాత్రులలో విశేషంగా పూజలు అందుకున్న 33 కేజీల లడ్డును లక్కీ డ్రా లో డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ శ్రీ పసుమర్తి రామ్మోహన్ రావు గెలుపొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లడ్డు లక్కీ డ్రా లో విజేతగా నిలవడం నాకు ఎంతో ఆనందంగా గర్వంగా ఉందని, ఈ లక్కీ డ్రా ఎంతో చక్కగా నిర్వహించిన కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారం ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని కోరారు. ఈ విజయాన్ని అందరితో పంచుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందని గెలుపొందిన లడ్డును మేళ తాళాలతో ఇంటి వద్దకు పంపించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వరద పరిస్థితులపై పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**- వరద పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ**

**- కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్: 1077, సెల్ నంబర్ 9063211298**



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 23 (భద్రాద్రిన్యూస్ ):** అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.జిల్లాలోని వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు తదితర ప్రాంతాల్లో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, పరిస్థితిని బట్టి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్న వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, నదులను దాటేందుకు ప్రజలు ప్రయత్నించ రాదని కలెక్టర్ సూచించారు. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, నీట మునిగిన ప్రాంతాలు తదితర ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో రాకపోకలను పర్యవేక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు వరదలకు సంబంధించిన ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. కంట్రోల్ రూమ్‌కు అందిన సమాచారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్: 1077, కంట్రోల్ రూమ్ సెల్ నంబర్: 9063211298 ప్రజలు ఈ నంబర్లను వినియోగించుకొని వరద పరిస్థితులు, అత్యవసర సమస్యలపై సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# కోదాడ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**కోదాడ,సెప్టెంబర్ 23(భద్రాద్రి న్యూస్):**
కోదాడ పట్టణ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కోదాడ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మండప ఆవరణలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పాల్గొన్న ఆయన, వేలంలో లడ్డూను దక్కించుకున్న విజేతలకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

**మాజీ ఎమ్మెల్యేకు ఘన సన్మానం**



తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ కోదాడ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు శాలువా కప్పి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, నిర్వాహకులు, స్థానిక నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కనకం ఉపేందర్‌ను పరామర్శించిన బానోతు మనిషా లక్ష్మి

**- చింతలపాడులో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకురాలు**

**సింగరేణి, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండలం మోట్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చింతలపాడు గ్రామానికి చెందిన కనకం ఉపేందర్‌ను బీఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోతు మనిషా లక్ష్మి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌ను కలిసి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బానోతు మనిషా లక్ష్మి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.





# ఏఐకేఎంయస్ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని యాపలగడ్డ లో అరకల ప్రదర్శన






**గుండాల, సెప్టెంబర్ 23 , భద్రాద్రి న్యూస్:** సెప్టెంబర్ 28, 29, 30 తేదీల లో ఖమ్మం పట్టణం లో జరిగే AIKMS జాతీయ నాల్గవ మహాసభల ను జయప్రదం చేయాలని కోరుతూ ఈ రోజు గుండాల మండలం యాపలగడ్డ లో అరకల తో ప్రదర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి AIKMS మండల అధ్యక్షులు గడ్డం లాలయ్య గుండాల సర్పంచ్ కోరం సీతారాములు మాట్లాడుతూ దేశం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై రైతులు కూలీలు ఏకమై పోరాడాలని వారు పిలుపు నిచ్చారు ఎన్నికల ముందు రైతులకు 12000 రూపాయలు ఇస్తామని వ్యవసాయ రంగాన్ని రక్షిస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని దారాదత్తం చేస్తూ నూతన వ్యవసాయ రంగ చట్టాలతో పల్లెల్లో నివసించే రైతులను దివాలతీపిస్తున్నారని అన్నారు . నూతన యాప్ లను తీసుకొచ్చి ఏజెన్సీ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వల్ల సరైన సమయానికి ఎరువులు అందక పోయడం తో రైతుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని ఉపాధి హామీ పథకాన్ని పాత పద్దిలోనే కొనసాగించాలని విద్యుత్ సవరణ బిల్లు విత్తన చట్ట బిల్లు నూతన అటవీ హక్కుల నియమాలను ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు ఈ సమస్యలపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించుటకు జరుగుతున్న ఈ మహాసభలను రైతులు కూలీలు కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నాయకులు CPI ML న్యూడెమోక్రసీ మండల నాయకులు నరసన్న అరెం నరేష్ , రైతులు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# గుండాల మండల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌ను వెంటనే నియమించాలి

**- ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పూనెం మంగయ్య**




**గుండాల సెప్టెంబర్ 23 భద్రాద్రి న్యూస్ :** గుండాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండు నెలలుగా డాక్టర్ లేకపోవడంపై ప్రగతిశీల యువజన సంఘం (PYL) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రోజు ్రూ డివిజన్ అధ్యక్షులు వుకే శ్రావణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పూనేం మంగయ్య, మండల కార్యదర్శి కల్తి సుదర్శన్ మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, గుండాల మండల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ లేక రెండు నెలలు కావస్తున్నా ణవీనూ గానీ, సంబంధిత అధికారులు గానీ పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయి. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు డాక్టర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దిక్కుతోచక ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తే టెస్టుల పేరుతో, వైరల్ ఫీవర్ అంటూ భయపెట్టి వేల రూపాయలు దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ణవీనూ వెంటనే స్పందించి గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి 24 గంటల డాక్టర్‌ను, సరిపడా మందులను అందుబాటులో ఉంచి మండల ప్రజల ప్రాణాలను కాపాడాలని ్రూ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: కల్తి లక్ష్మీనారాయణ, కల్తి సంపత్, కల్తి సాంబయ్య, కల్తి సమ్మయ్య, కల్తి కార్తీక్, కల్తి కిరణ్, హర్షవర్ధన్ తదితరులు. పాల్గొన్నారు.

# నిమజ్జన వేళ అప్రమత్తం!

**- చెరువుల వద్ద అధికారుల పరిశీలన.. లోతైన ప్రాంతాలకు వెళ్లొద్దని సూచన**




**సింగరేణి, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్ రాములు):** వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో సింగరేణి మండల అధికారులు అప్రమత్తమయ్యారు. నిమజ్జనం జరిగే చెరువులు, కుంటల ప్రాంతాలను తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు.

మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్రప్రసాద్, ఎస్సై బైరు గోపి తదితరులు నిమజ్జన ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువులు, కుంటల్లో నీటి మట్టం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యుత్సాహంతో లోతైన ప్రాంతాల్లోకి వెళ్లకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులను నిమజ్జన ప్రాంతాలకు తీసుకురావద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ లోతైన నీటిలోకి ఎవరినీ అనుమతించవద్దని స్పష్టం చేశారు.

**బొడ్రస్‌కుంట వద్ద ప్రత్యేక పరిశీలన**

భాగ్యనగర్ తండాలో నిమజ్జనం జరిగే బొడ్రస్‌కుంట చెరువు ప్రాంతాన్ని అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారు. నిమజ్జన సమయంలో ప్రజల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచ్, పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు సంయమనం పాటిస్తూ అధికారుల సూచనలు తప్పక పాటించాలని కోరారు. ఈ పరిశీలనలో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, పంచాయతీ కార్యదర్శి పెంద్రా అనిల్ కుమార్, ఆర్ఐ బి. జగదీశ్, ప్రశాంత్, వార్డు సభ్యుడు భూక్య కిషన్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# భూపతిరాయణి చెరువులో గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**- నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు.. భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు**

**సింగరేణి, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండలం గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని భూపతిరాయణి చెరువులో చుట్టుపక్కల గ్రామపంచాయతీలకు చెందిన వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి, నిర్వాహకులకు తగు సూచనలు చేసేందుకు సింగరేణి మండల తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీఓ రవీంద్ర ప్రసాద్, ఆర్ఐ జగదీష్ బుధవారం చెరువు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. చెరువులో నిమజ్జనం చేసే సమయంలో భక్తులు, యువకులు మద్యం సేవించి నీటిలోకి దిగకుండా పర్యవేక్షించాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వాంకుడోత్ కుమార్‌కు సూచించారు. నిమజ్జన ప్రాంతంలో భద్రత, లైటింగ్ తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ భూపతిరాయణి చెరువులో గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా లైటింగ్‌తో పాటు అవసరమైన చోట జేసీబీని ఏర్పాటు చేస్తామని అధికారులకు వివరించారు. చుట్టుపక్కల గ్రామపంచాయతీల పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులకు ఫోన్ల ద్వారా సమాచారం అందించి, నిమజ్జన కార్యక్రమాన్ని క్రమబద్ధంగా నిర్వహించేలా సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో భద్రతా చర్యలను పటిష్ఠం చేసి, భక్తుల సహకారంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వాంకుడోత్ కుమార్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తులస్య తండా, భిక్య తండాలలో ఘనంగా మహా అన్నదానం

**- అప్పాయిగూడెంలో గణపతి లడ్డూ వేలం.. రూ.42,500కు దక్కించుకున్న మోడెం వెంకన్న--కృష్ణవేణి దంపతులు**

**సింగరేణి, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్ రాములు):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తులస్య తండా, భిక్య తండాలలో మహా అన్నదాన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాల వద్ద భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. తులస్య తండాలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి భుక్యా కస్న--కమిలి, భుక్యా విజయ్--కవిత, భుక్యా వినయ్--జ్యోతి, భుక్యా అశోక్--సాల్కు (అను) దాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదం అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. అదేవిధంగా భిక్య తండాలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని అప్పాయిగూడెం గ్రామ సర్పంచ్ దండు ప్రవీణ్ ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**రూ.42,500కు గణపతి లడ్డూ వేలం**

అప్పాయిగూడెం గ్రామంలో కొలువుదీరిన శ్రీ గణపతి విగ్రహం చేతిలోని లడ్డూకు నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన మోడెం వెంకన్న--కృష్ణవేణి దంపతులు రూ.42,500కు దక్కించుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక ధరకు లడ్డూను వేలంలో దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ అన్నదాన కార్యక్రమాలకు సహకరించిన దాతలను, లడ్డూ వేలంలో పాల్గొని దక్కించుకున్న మోడెం వెంకన్న--కృష్ణవేణి దంపతులను అభినందించారు. గణనాథుడి ఆశీస్సులు దాతల కుటుంబాలతో పాటు లడ్డూను దక్కించుకున్న దంపతుల కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మోట్లగూడెం సర్పంచ్ పొడుగు పెంటయ్య, కార్యదర్శి కృష్ణవేణి, ఎస్ఎన్ నాగులు నాయక్, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



# ఏఎన్ఎంలు, ఆశాలపై శ్రమ దోపిడీ ఆపాలి

**- డేటా ఎంట్రీల పేరుతో అదనపు పనిభారం వద్దు.. ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలి**

**- సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్**



**కారేపల్లి, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్ రాములు):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలపై డేటా ఎంట్రీలు, ఆన్‌లైన్ నమోదు, వివిధ సర్వేల పేరుతో అదనపు పనిభారం మోపడం తక్షణమే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రజారోగ్య సేవల్లో కీలకంగా పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బందిని అదనపు పనులతో వేధించడం వల్ల వారి ప్రధాన విధులకు ఆటంకం కలుగుతోందని అన్నారు. వైద్య సేవలు అందించాల్సిన ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు యాప్‌లలో వివరాల నమోదు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీలు, సర్వేలు తదితర పనులతో ఎక్కువ సమయం గడపాల్సి వస్తోందని తెలిపారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రజలకు అందాల్సిన వైద్య సేవలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య సిబ్బందికి వారి ప్రధాన విధులకు ప్రాధాన్యం కల్పిస్తూ అదనపు పనిభారాన్ని తగ్గించాలని సూచించారు.

**ఓటీపీతో ప్రజల్లో అనుమానాలు**

కుష్టు వ్యాధి సర్వే వంటి కార్యక్రమాల్లో ప్రతి వ్యక్తి నుంచి ఓటీపీ తీసుకునే విధానం క్షేత్రస్థాయిలో ఇబ్బందులకు కారణమవుతోందని భూక్య శివ నాయక్ పేర్కొన్నారు. సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగిన నేపథ్యంలో ఆరోగ్య సిబ్బంది ఓటీపీ అడగడంతో కొందరు అనుమానించే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీనివల్ల ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బందిపై అపోహలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.

**ఆరోగ్య సిబ్బందికి రక్షణ, సౌకర్యాలు కల్పించాలి**

ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను చేరువ చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని భూక్య శివ నాయక్ అన్నారు. వారిని డేటా నమోదు సిబ్బందిగా కాకుండా ప్రజారోగ్య సేవల్లో కీలకమైన కార్యకర్తలుగా గుర్తించాలని కోరారు. అదనపు పనిభారాన్ని తగ్గించి, క్షేత్రస్థాయిలో సురక్షితంగా, ప్రశాంతంగా విధులు నిర్వహించే వాతావరణం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలపై బలవంతపు డేటా ఎంట్రీల భారాన్ని తొలగించాలని, క్షేత్రస్థాయిలో ఇబ్బందులకు కారణమవుతున్న ఓటీపీ విధానాన్ని పునఃపరిశీలించి రద్దు చేయాలని భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. ప్రజారోగ్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆరోగ్య సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, రక్షణ కల్పించాలని కోరారు.

# పెనుబల్లి ప్రజలకు బ్రిడ్జి కష్టాలు తీరేదెప్పుడు?

**- శంకుస్థాపన చేసి ఏడాదిన్నర**

**- ఇంకా ప్రారంభం కాని నిర్మాణ పనులు**

**- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజల్లో భయాందోళన**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్) :** చుంచుపల్లి మండలం పెనుబల్లి పంచాయితీ వాసుల వంతెన కష్టాలు తీరడం లేదు. గ్రామానికి కీలకమైన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడాదిన్నర గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభ దశను దాటలేదు. సుమారు రూ.6.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ బ్రిడ్జికి గత ఏడాది మే నెలలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు. పెనుబల్లి నుంచి కొత్తగూడెం పట్టణానికి వెళ్లేందుకు ఈ బ్రిడ్జి ప్రధాన మార్గంగా ఉంది. రైతులు పండించిన పంట వడ్ల బస్తాలు, కూరగాయలు, వ్యవసాయ పనిముట్లతో పాటు విద్యార్థులు, గ్రామస్తులు నిత్యం ఈ మార్గం మీదుగా పట్టణాలకు రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు రెండేళ్ల క్రితం బ్రిడ్జి కుంగిపోవడంతో ప్రస్తుతం దానిపై ప్రయాణించేందుకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించే పరిస్థితులు ఏర్పడి రాకపోకలకు మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. శంకుస్థాపన చేసి ఏడాదిన్నర గడుస్తున్నా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అధికారులు పలుమార్లు వచ్చి పరిశీలిస్తున్నప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. పెనుబల్లి ప్రజలు పట్టణానికి వెళ్లేందుకు ఈ బ్రిడ్జిపైనే ఆధారపడుతున్నారని, వర్షాకాలంలో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులను వేగవంతం చేసి బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని పెనుబల్లి సర్పంచ్ రెడ్డి సుజాత కోరారు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఏడాది క్రితమే పూర్తయింది. బ్రిడ్జి కింద రాక్, సాండ్‌కు సంబంధించిన పరిశీలనలు పూర్తయ్యాయి. ఉన్నతాధికారులు ఎస్ఈ కూడా ఇటీవల ప్రాంతాన్ని సందర్శించారు. బ్రిడ్జిపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగించేందుకు సోలార్ పవర్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడామని, బ్రిడ్జి డిజైన్‌ను ఆమోదం కోసం పంపించామని, నిర్మాణానికి అవసరమైన స్టీల్ కూడా సిద్ధంగా ఉంది. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పీఆర్ డీఈ జె.నాగేంద్ర తెలిపారు.

# ఆదివాసీల భూములకు రక్షణ ఎక్కడ?

**– ఏడ్జిర్లపల్లి భూ వివాదంపై రెవెన్యూ తీరుపై తీవ్ర ఆగ్రహం..**
**రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు..**
**తహసీల్దార్ బదిలీకి ఏఎన్ఎస్ డిమాండ్**

**వాజేడు, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్):** ఆదివాసీల భూ హక్కులను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగమే సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూములపై వివాదాలు, ఆక్రమణల ఆరోపణలు ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదంటూ ఆదివాసీ నవనిర్మాణ సేన (ఏఎన్ఎస్) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏడ్జిర్లపల్లి గ్రామంలోని ఆదివాసీ రైతుల భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వాజేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. రెండో రోజు దీక్షలను ఏఎన్ఎస్ వాజేడు మండల అధ్యక్షుడు మోడెం నాగరాజు రైతులకు పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల భూ హక్కులకు భంగం కలిగేలా పరిస్థితులు ఏర్పడుతున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పరిష్కారం చూపకపోవడం ఆదివాసీ రైతుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

**సర్వే నంబర్లు 25, 32పై వివాదం**

ఎడ్జర్లపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 25, 32లో ఆదివాసీలకు అసైన్మెంట్ పట్టాలు ఉన్నాయని, ఆయా భూములపై గిరిజనేతరుల కబ్జా ఆరోపణలు ఉన్నాయని నాగరాజు పేర్కొన్నారు. భూములకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను తేల్చాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. అయితే సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు స్పందించకపోవడం, తమ భూముల కోసం ప్రశ్నిస్తున్న ఆదివాసీ రైతులపైనే కేసులు నమోదవుతున్నాయన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. భూమి ఎవరిది? రికార్డుల్లో హక్కుదారు ఎవరు? ఆక్రమణ జరిగిందా లేదా? అనే అంశాలపై బహిరంగంగా విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయని ఆయన పేర్కొన్నారు.




**"ఆదివాసీల భూముల విషయంలో నిర్లక్ష్యం ఎందుకు?" :** గిరిజన ప్రాంతాల్లో అమలులో ఉన్న భూ రక్షణ చట్టాలు, ఎల్‌టీఆర్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఏఎన్ఎస్ డిమాండ్ చేసింది. గిరిజనేతరుల ఆక్రమణలు ఉన్నట్లు విచారణలో తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుని, అర్హులైన ఆదివాసీ రైతులకు వారి భూములపై హక్కులు పునరుద్ధరించాలని కోరింది. ఆదివాసీల భూములను కాపాడాల్సిన వ్యవస్థే మౌనం వహిస్తే బాధితులు ఎవరిని ఆశ్రయించాలనే ప్రశ్న తలెత్తుతోందని నాగరాజు అన్నారు. భూ సమస్య పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితికి ఆదివాసీ రైతులను నెట్టకుండా అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

**తహసీల్దార్ బదిలీ చేయాలని డిమాండ్ :**

ఆదివాసీల భూ సమస్యల పరిష్కారంలో వాజేడు తహసీల్దార్ శ్రీనివాసరావు తగిన స్థాయిలో స్పందించడం లేదని ఆరోపిస్తూ ఆయనను తక్షణమే బదిలీ చేయాలని నాగరాజు డిమాండ్ చేశారు. ఎడజర్లపల్లి భూ సమస్యపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమగ్ర విచారణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, భూ రికార్డులు, పట్టాలు, రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రిలే నిరాహార దీక్షలను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు దిగాల్సి వస్తుందని నాగరాజు హెచ్చరించారు. ఆదివాసీల భూముల విషయంలో రాజీ ప్రసక్తే లేదని, హక్కుల పరిరక్షణ కోసం ఏఎన్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఎడజర్లపల్లి భూ వివాదంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, అర్హులైన ఆదివాసీ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా అధికార ప్రతినిధి పాయం అజయ్, జిల్లా కన్వీనర్ కుంజ మహేష్, జిల్లా కార్యదర్శి కంతి విజయ్, వెంకటాపురం మండల అధ్యక్షుడు వాసం నారాయణ, వాజేడు మండల ఉపాధ్యక్షుడు తల్లాడి ప్రసాద్, మండల కార్యదర్శి తలండి సంతోష్, అట్టం బాలకృష్ణ, జగదీష్‌తో పాటు పలువురు ఆదివాసీ రైతులు పాల్గొన్నారు.

# బొక్కలతండాలో కన్నులపండువగా గణేష్ శోభాయాత్ర

**– భక్తిశ్రద్ధల నడుమ గణనాథుడి నిమజ్జనం.. రూ.18,800కు లడ్డూను కైవసం చేసుకున్న అజ్మీరా తిరుపతి**




**కారేపల్లి, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్ రాములు):** ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని బొక్కలతండాలో హనుమాన్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుడికి గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. నిమజ్జనోత్సవానికి ముందు నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఉత్సాహంగా సాగింది. వేలంలో అజ్మీరా తిరుపతి (రిషి) రూ.18,800కు లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం గణేష్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో కన్నులపండువగా శోభాయాత్ర నిర్వహించారు. డప్పులు, మేళతాళాలు, భక్తిగీతాల నడుమ సాగిన శోభాయాత్రలో చిన్నారులు, యువత, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ 'గణపతి బప్పా మోరియా' అంటూ నినాదాలు చేయడంతో బొక్కలతండా అంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం విగ్రహాన్ని నిమజ్జన ప్రదేశానికి తరలించి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. గణేష్ ఉత్సవాల సందర్భంగా గ్రామస్థుల ఐక్యత, భక్తిభావం, యువత ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన హనుమాన్ యూత్ ఉత్సవ కమిటీ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

# ప్రశాంత వాతావరణంలో గంగకు చేరిన గణనాథుడు

- **గణపతి బొప్పా మోరియా నినాదాలతో దద్దరిల్లిన కోదాడ**
- **తీన్మార్ డప్పుల దరువులకు యువత స్టెప్పులే.. స్టెప్పులు**
- **కోలాటాలతో, డ్యాన్స్ లతో మహిళల సందడి**
- **రంగులు చల్లుకుంటూ యువత కేరింతలు**
- **బాణాసంచా మోతలతో హోరెత్తిన ప్రధాన వీధులు**
- **భక్తులకు మంచినీరు అందించి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ముస్లిం సోదరులు**
- **భారీ ఊరేగింపులతో పెద్ద చెరువుకు చేరిన గణనాథులు**
- **ప్రశాంతంగా నిమజ్జనం... పోలీసుల గట్టి బందోబస్తు**



**కోదాడ, సెప్టెంబర్ 23(భద్రాద్రి న్యూస్):** కోదాడ పట్టణం బుధవారం గణేష్ నిమజ్జనం లో భాగంగా జరిగిన ఊరే గుంపులో గణపతి బొప్పా మోరియా నినాదాలతో కోదాడ పట్టణం దద్దరిల్లింది. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో వివిధ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఊరేగింపులు నిర్వహించగా, గణనాథుల దర్శనానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించి, డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, డీజే సంగీతాల నడుమ ఊరేగింపులు సాగాయి. తీన్మార్ డప్పుల దరువులకు యువత ఉత్సాహంగా స్టెప్పులు వేస్తూ సందడి చేయగా, మహిళలు కోలాటాలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. యువత, చిన్నారులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ నిమజ్జన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు భక్తులు ప్రత్యేక దుస్తులు ధరించి గణనాథుడి ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలుచోట్ల బాణాసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకోవడంతో పట్టణ ప్రధాన వీధులు సందడిగా మారాయి. మేళగాళ్లు, డప్పు బృందాలు, మైక్ సౌండ్ సిస్టమ్‌లకు భారీగా డిమాండ్ కనిపించింది. వివిధ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలివెళ్లే భక్తులకు మంచినీరు, ప్రసాదం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కోదాడకు చెందిన ముస్లిం సోదరులు నిమజ్జనానికి తరలివెళ్తున్న హిందూ భక్తులకు మంచినీరు అందించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. పరస్పర సహకారం, సోదరభావంతో నిమజ్జన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పలుచోట్ల పోటాపోటీగా పులి హోరా ప్రదర్శనలు నిర్వహించడంతో యువత, భక్తుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. గణపతి లడ్డూ ప్రసాదాల పంపిణీ కూడా విస్తృతంగా చేపట్టారు. భక్తులు లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించి గణనాథుడి ఆశీస్సులు పొందారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో గణపయ్యలను కోదాడ పెద్దచెరువు వద్ద నిమజ్జనం కోసం తరలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేష్ విగ్రహాల కోసం కోదాడ మున్సిపాలిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో పెద్దచెరువు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణ, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర ఏర్పాట్లు చేపట్టారు. నిమజ్జన ప్రదేశంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల నాయకులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తులకు భోజన వసతి కల్పించారు. గణనాథుల ఊరేగింపులు,



భక్తుల జయజయధ్వానాలు, డప్పుల దరువులు, మేళతాళాల మధ్య సాగి చివరకు పెద్దచెరువు నిమజ్జన ఘాట్‌కు చేరుకున్నాయి. భక్తులు గణపయ్యకు చివరి పూజలు నిర్వహించి, కన్నుల పండువగా వీడ్కోలు పలికారు. అనంతరం గణనాథులను భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేర్చారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం పూర్తవడంతో నిర్వాహకులు, పోలీసులు, మున్సిపల్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భక్తుల ఐక్యత, పరస్పర సహకారం, మత సామరస్యం, శాంతియుత వాతావరణంలో జరిగిన నిమజ్జన వేడుకలు కోదాడలో పండుగ వైభవాన్ని చాటిచెప్పాయి.

# గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

**– బీజేపీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్**




**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్) :** కొత్తగూడెం పట్టణంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్రను దృష్టిలో ఉంచుకొని రోడ్ల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే ఏర్పాటు చేయాలని బీజేపీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ కోరారు. ఈ మేరకు బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మేయర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. నిమజ్జన శోభాయాత్రలో వేలాది మంది భక్తులు, ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధాన నిమజ్జన మార్గాల్లో ఉన్న గుంతలను వెంటనే పూడ్చి రోడ్లను ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని, శోభాయాత్ర సమయంలో ప్రత్యేక ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు వంటి అత్యవసర వాహనాలకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బైపాస్ మార్గాల ద్వారా వాహనాలను మళ్లించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నిమజ్జన మార్గంలో వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్య సిబ్బంది, చెత్త బుట్టలు వంటి మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని కోరారు. గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో సజావుగా జరిగేలా మున్సిపల్, పోలీస్, ట్రాఫిక్ తదితర శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని బీజేపీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కనుకుంట్ల రాజా మొగిలి, పట్టణ ప్రధాన కార్యదర్శి చంద్రగిరి రమేష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు హృదయ్, నాయకులు భాస్కర్ గౌడ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

# పాలన, సంస్కరణలపై చర్చ




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** పరిపాలన, సంస్కరణలతో పాటు యువత, మహిళలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరింత చేరువ చేయడంపై 'చింతన్ శిబిర్' తొలిరోజున కేంద్ర క్యాబినెట్ విస్తృతంగా చర్చించింది. వివిధ శాఖలు, విభాగాల మధ్య సమన్వయంతో ప్రభుత్వ సేవలు, పథకాలు ప్రజలకు మరింత సమర్థంగా చేరవేసే విధానంపైనా మంతనాలు జరిపారు. బుధవారం నాలుగు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రులను 8 బృందాలుగా విభజించి.. ప్రతి బృందంతో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమై అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం వివిధ అంశాలను ప్రజల ముందుకు ఎలా తీసుకెళ్లాలనే దానిపై ప్రధాని వారికి సూచనలు చేశారు. 'జన్ విశ్వాస్ సే జన్ ఆధార్', ప్రభుత్వంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు, వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రాధాన్య అంశాలపైనా కేంద్ర మంత్రులు చర్చించారు.

# ఎస్సీ సెల్ బలోపేతమే లక్ష్యం.. కోట నరేంద్రకు కీలక బాధ్యతలు

- *వెంకటాపురం--వాజేడు మండలాల ఇన్‌చార్జిగా నియామకం..*
- *ఈ నెల 30లోపు మండల, గ్రామ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశం*

**వాజేడు , సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్):** ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ కరంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా స్థాయి అత్యవసర సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి పుల్ల దుర్గారావు, ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కార్యదర్శి వినయ్ కుమార్, దళితరత్న నత్తి కర్నేలు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ డిపార్ట్‌మెంట్‌ను గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయడంపై నాయకులు చర్చించారు. పెండింగ్‌లో ఉన్న మండల, గ్రామ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా వెంకటాపురం, వాజేడు మండలాల ఎస్సీ సెల్ ఇన్‌చార్జిగా ములుగు జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కోట నరేంద్రను నియమించారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి, జిల్లా ఇన్‌చార్జి పుల్ల దుర్గారావు, రాష్ట్ర కార్యదర్శి వినయ్ కుమార్ తదితరుల సమక్షంలో ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కోట నరేంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. పార్టీ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ఎస్సీ సెల్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ నెల 30వ తేదీలోపు వెంకటాపురం, వాజేడు మండలాలతో పాటు గ్రామస్థాయి కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసి,



వివరాలను జిల్లా కమిటీకి అందజేస్తామని తెలిపారు. తనను రెండు మండలాలకు ఇన్‌చార్జిగా నియమించిన జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి, జిల్లా ఇన్‌చార్జి పుల్ల దుర్గారావు, రాష్ట్ర కార్యదర్శి వినయ్ కుమార్, దళితరత్న నత్తి కర్నేలు తదితరులకు కోట నరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046